# సారాంశం

విదుపదు:

కారు నిశ్శబ్దంగా పోతూవుంటే రాజుగారు వెనకసీట్లో ఓమూలకి విశ్రాంతిగా ఆనికూచున్నాడు. అతనికళ్లు రోడ్డునీ జనాన్నీ పరిశీలిస్తున్నాయి. తనమనుషులు ఇచ్చిన ఇన్ఫర్మేషన్ ఏమాత్రం తప్పుకాదనే అతనికి అనిపిస్తోంది.

ఎందుకంటే రోడ్డుకి రెండువైపులా ఫాన్సీషాపులు, కంగన్‌హాళ్లూ, బట్టల షాపులూ, ఫర్నిచర్ షోరూములూ, వీడియోపార్లర్లూ, బ్రాందీషాపులూ అన్నీ కళకళ లాడుతూ రద్దీగావుండటంతో అతడికి సంతృప్తికలిగింది. అతను గత రెండ్రోజులు సినిమాహాళ్ల దగ్గర తక్కువక్లాసు 'క్యూ'లనిగూడా పరిశీలించాడు. అవి కొండవీటి చాంతాడంతపొడుగున్నాయి. అప్పుడు టికెట్లు దొరకని తక్కువక్లాసు వాళ్లంతా పైక్లాసుల బుకింగుల మీదికి ఉప్పెనలా ఎగబడ్డమూ చూశారు రాజుగారు.

దాంతో ఈప్రాంతం ప్రజలకి తానుముందు అనుకున్నట్టుగానే తలసరి ఆదాయం బాగాఉందని నమ్మకం కుదిరింది. ఆదాయం సంగతెలావున్నా ఆనందంకోసం జనం డబ్బుఖర్చుకి వెనకతియ్యరని గూడా అర్థమైంది.

ఆధైర్యంతోనే పాతకాంట్రాక్టర్లకన్నా తాను నెలకి పద్దెనిమిదిలక్షలు అంటే సంవత్సరానికి రెండుకోట్లపదహారులక్షలు పాటపెంచాడు. అందువల్లే ఈ సంవత్సరం ఊసిటీ సారాకాంట్రాక్టు తనకి వచ్చింది. చౌదర్లని మట్టికరిపించాడు తాను. రాజులంటే తడాఖాచూపించాడు.

కార్లో కూర్చున్నరాజుగారు టూత్‌బ్రష్ మీసాన్ని సవరించుకుని ఖద్దరుచొక్కా-జేబులోంచి చుట్టబయటికి తీశారు. అది గోదావరి లంకల్లో పండిన పొగాకుచుట్ట. స్వయంగా రాజుగారే చుట్టుకుంటారు చుట్టల్ని. గుప్పున వెలిగించి దమ్ములాగుతూండగా కారు సడన్‌గా బ్రేకుపడింది.

"ఏట్రా?" అన్నాడు రాజుగారు కిటికీలోంచిచూస్తూ డ్రైవర్‌తో.

"ట్రాఫిక్ జామ్మయి పోయిందండి. ముందు బళ్లన్నీ కదల్డం లేదు" అన్నాడు డ్రయివర్.

రాజుగారు తల లోనికి లాక్కుని చుట్టపీలుస్తూ ముందు అద్దంలోంచి చూశాడు. ఓసిటీబస్సు ఆగివుంది. దానివెనక బాంబేడయింగ్ వాడి అడ్వర్టైజుమెంటు బొమ్మ

958

వుంది. ఓపిల్లచెయ్యినీ ఓకాలునీసాచి చీరనిపరిచి చూపెడుతోంది. ఆపిల్ల ఒంటి నిండా చీరవున్నట్టేవుందిగానీ అవయవాలు అన్నీ తెలుస్తున్నాయి. మొహం ఎలా వుందోనని చూడబోతే నల్లటి పోస్టరొకటి అక్కడంటించివుంది. అది చదివిన రాజు గారు ముఖం చిట్లించారు.

"సారాయి వందగ్రాములు మూడురూపాయలకే అమ్మాలి? ఇదేంపోస్టరు?" రాజుగారు చుట్టని నోట్లోనించితీసి సరిగాచూడబోయారు గానీ ట్రాఫిక్‌క్లియరై బస్సు కదిలిపోయింది. "ఇదేమిటి? సారాని వందగ్రాములు మూడురూపాయలకే ఎలా ఇవ్వటం? అసలు ఎలా కుదురుతుంది? ఈ అడిగేదెవరు? పోస్టరువేసిందెవరు? సారాధర తగ్గాలని ఎవడన్నా పోస్టరువేస్తాడంటే నమ్మడానికే వీలుకావటంలేదే?"

రాజుగారు చుట్టని రెండుసార్లుపీల్చి "ఒరేసన్నాసీ! కార్ని పరిగెత్తించి ఎదురుగ్గా ఆ బస్సెనకపెట్రా!" అన్నారు.

డ్రైవరు సన్నాసి యాంత్రికంగా ఆక్సిలేటర్నినొక్కి కార్నిమూకించాడు. ఒక నిముషంలో మూడువాహనాల్నిదాటి సిటీబస్సు వెనకవుండి కారు.

"కాసేపు ఈ బస్సెనకే ఎళ్లు" అన్నారు రాజుగారు పోస్టర్నిచదవడానికి ముందుకి వంగుతూ. పోస్టర్నిచూస్తూనే నుదురుచిట్లించాడు. నిజమే తానుచదివింది. సారాయి ధర తగ్గాలని రాడికల్స్ వేశారు పోస్టర్లు!

"ఈనా కొడుకుల కళ్లల్లోనూ పడ్డాన్నమాట!" అనుకున్నాడు. ఏటి వీళ్లవుద్దేశం? ఉత్తబెదిరింపా లేక దీన్నిసాగిస్తారా? కొట్టిపేయడానికి వీల్లేదసలే. రాడికళ్లంటే ఏటో చిన్నబ్బాయి ఇంతకుముందే చెప్పాడుగూడాసూ! 'అల్లనట్టుకోడం అట్టేకుదర్దు పందాలడిగే సీకటోళ్లనుకుంటన్నారేవో'గానీ ఆలదగ్గిర అదేంనడవదు. పందాలసీక టోల్లు యేరే, రాడికల్సుయేరే! రాడికల్సంటే మరిరాడికల్సే. ఆడు జెప్పిందినకపోతే ఆడోనువ్వో. ఎవుడో ఒగుడే ఉంటాడు తర్వాత. ఆల్లదంతా పేరలల్ గౌర్మెంట్! అసలు గౌర్మెంట్ కంటే ఆల్లేపవర్‌పుల్.' అంటూ చిన్నబ్బాయి తనకి చెప్పినప్పుడు తాను తేలిగ్గాతీసేశాడు. 'ఒరే కాపునాయాలా! నేను రాజునిరా! గోదావరి రాజు లంటే ఏట్రారే! ఎడ్మినిస్ట్రేషను పనగా రూలింగు మాకుతెల్సినట్టు నీకేంతెల్సురా? అంచేతలాగంటున్నావుగాని ఒకతరంకిందిదాకా ఇవి కత్తులుపట్టి రాజ్యాలేలినజాతిరా చూడుమరి ఎలా చక్రంతిప్పుతానో!" అని తానన్నాడు. కానీ ఇక్కడికొచ్చింతరవాత స్పాటుమీద కాస్తజంకువేసిన మాటనిజం.

959

శాంతారావుని రాడికల్సు చంపేశారని విన్నప్పుడు ఈల్లనికాస్త జాగ్రత్తగా పట్టించుకోవాలేగానీ మరీ తక్కువంచనా వేయొద్దనితెల్సింది. వాళ్ళ నాయకుడు గిరి భూషణాన్ని పోలీసులతో హత్యచేయించడంలో శాంతారావు పాత్రవుందని సారావర్గాల్లో అందరికీతెల్సు. అందుకే ఇప్పుడివాళ శాంతారావు వాళ్లచేతుల్లో ఘోరంగా చచ్చాడనీ తెల్సు.

శాంతారావుచావుతో సారా సామ్రాజ్యంలో రైడుఇన్‌ఛార్జీలందరికీ గొంతులు దగ్గరపడ్డాయి. పాటని దాదాపు ఎనభైశాతం పెంచి తాను కాంట్రాక్టు తీసుకున్నందుకు చౌదర్లు ఏడ్చారుగానీ ఈ శాంతారావుచావుతో వాళ్లు సంబరపడ్డారు. తామెలాగూవెళ్ళి పోతున్నారు. ఇక ఈరాజులు ఎలాచేస్తారోచూద్దాం అని ఉద్దేశం !

రాజుగారు చుట్టని బయటికి విసిరేశారు. "ఛీ ఛీ ! శూద్రవెధవలు- అంతకు మించి ఏంఆలోచించి తగలడతారు ?" అనుకున్నాడు.

కారు స్లోఅయింది. "మళ్ళీ ఏమొచ్చితగలడిందిరా ?" అన్నారు రాజుగారు విసుగ్గా.

"ఇక్కడట్రాఫిక్కు విపరీతంగా ఉందండయా. సూడండసలు ఒక్కడుగేనా కదల్టానికీల్లేకుండావుంది." అన్నాడు డ్రయివరు కారుని ఫస్టుగేర్లోకిమారుస్తూ.

రాజుగారు చుట్టూచూశారు. అక్కడోసినిమా టాకీసువుంది. చీమలపుట్టలాగా జనం ! సైకిళ్లు, రిక్షాలు, స్కూటర్లు, మోటారుసైకిళ్లు, కార్లు హదబారులు రోడంతా ఊరేగింపుతప్ప రోడ్డుకాదనిపించేటంతజనం !

కారు మెల్లిగాజరుగుతోంది. ఏదోకాలేజీ, ఒకఆస్పత్రి, దానిపక్కనే పాన్ షాపు, పక్కకిఎర్రబోర్డూ ! దానిమీద తెల్లగా పోలీసుస్టేషనుఅన్న అక్షరాలు చూడ గానే రాజుగారికళ్లు మెరిశాయి. ఇంతలో కారుకదలి ఏదోరిక్షానిగుద్ది మళ్ళీసాగిఆగేంత లో ఓసిన్మాటాకీసూ, గేరుమార్చి క్లచ్‌వదిలేంతలోపల మళ్ళీ ఓ సిన్మాటాకీసూ, టాకీసూ, టాకీసూ ఇద్దరు డాక్టర్లఇండ్లూ, పోస్టాఫీసూ, ట్యుటోరియల్‌కాలేజీ, తర్వాత రాజగృహద్వారంలా తెరుచుకున్న రెండు నల్లరేకుతలుపుల సారాడిపో ! దానిముందు సైన్యంలా డిపో జవాన్లూ !

రాజుగారు కారు గేసరికే అక్కడ ఇద్దరు పోలీసుయస్సైలు, ఒక పోలీసు జీపు ఎదురుచూస్తున్నాయి. రాజుగారు దిగుతూంటే గాలి "రాజుగారు, రాజుగారు" అన్నమాటల్ని మోసుకుని పరిగెత్తింది.

960

* * * *

క్లాసురూంలో కనకయ్యమాస్టారి కంఠం వినిపిస్తోంది.

గోవిందయ్య అటువైపునడిచాడు. గదిగుమ్మంముందు నిలబడి "సార్" అని పిలిచాడు. కనకయ్య చెబుతున్న పాఠంవదిలి బయటికొచ్చాడు. గోవిందయ్య అతని ఇంటిపక్క కుటుంబీకుడు.

"ఏందయా! ఇట్లవస్తివి?" కనకయ్య మాస్టారు అడిగాడు.

గోవిందయ్య నీళ్లనములుతూ చెప్పాడు. "మీ అబ్బాయిని పోలీసులు పట్టుక పోయిన్రు"

"ఆఁ!!!" కనకయ్యకు అర్థంకాలేదు ఒక్కనిముషం.

"ఎందుకో తెల్వదిగని మీరు గిట్ల బడికిరాంగనె అట్లపోలీసులచ్చి ఇంట్ల జొర్రిన్రు. అరుగుమీద మంచంఉంటె దాన్ని గుంజిపారేశి తలుపులు తన్నుకుంట లోపలికచ్చిన్రు. మేం అందరం ఏందిరోకతఅని వాకిట్లకుజేరెటాల్లకు దండా బజాయించిన్రు. ఇగమీవోడు ఇంటెనుక గోడదునికి ఉర్కబోతాంటె ఎనుకసందుల ఇద్దరు పోలీసులు రడీగున్నరట. లటుక్కన పట్టుకోని తన్నుకుంట తీస్కపోయిన్రు. ఇల్లంత గంద్రగోలంజేసి మీఆమెనుగూడ బూతులుతిట్టిన్రు. పోలీసులైరి ఏవలేంజెయ్యలేకపోయినం." గోవిందయ్య చెప్పాడు.

కనకయ్య ఆదుర్దాగా "ఇప్పుడేం జేద్దాం?" అన్నాడు.

"మీరు జల్దిన లీవుబెట్టిరాండ్రి. పోలీసుటేశన్లకుపోయి అసలు సంగతేందో సూద్దాం" అన్నాడు గోవిందయ్య.

కనకయ్య అయోమయంగా హెడ్మాస్టరు రూంవైపువెళ్ళాడు. విషయంవిని హెడ్మాస్టరు కనకయ్య కేసిచూసి

"ఏందయో మీవోడులంగలతోని తిర్గుతడా ఏంది?" అన్నాడు.

కనకయ్యకు తల కొట్టేసినట్టయింది. "లేదుసార్ మావోనికి లోకంజోలేపట్టది. వాని పుస్తకాలేందో వాడేందో!" అన్నాడు.

"ఏంలేకుంటె పోలీసులు ఎందుకు పట్టుకుంటరయా? పోలీసుల కండ్లల్లపడ్డదంటె లఫంగి కిందనే లెక్క!" హెడ్మాస్టరు నవ్వాడు.

కనకయ్య నొచ్చుకున్నాడు. "హాఫ్‌డే లీవ్‌శాంక్షన్ చేయండి" అని కాగితం మీద రాసిచ్చాడు.

హెడ్మాస్టరు వంకరవవ్వుతో కాగితంమీద శాంక్షన్ చేసినట్టు సంతకంచేసి దాన్ని పేపర్ వెయిట్ కిందపెట్టి "సరే వెళ్లిరాండి" అన్నాడు వెటకారంగా.

కనకయ్య బయటికి వచ్చేసరికి గోవిందయ్య బడివసారాలో బీడీకాలుస్తూ నించున్నాడు. అతన్ని చూడగానే కిందపారేసి నలుస్తూ

"రాండి రాండి ముందుగాల పోలీసు స్టేషనుకుపోవాలె" అన్నాడు.

కనకయ్యకు వ్యవహారాలేమీ తెలియవు. జన్మలో పోలీసుల నీడకూడాసోకి ఎరగడు. ఇన్నాళ్ళకి ఈ దౌర్భాగ్యుడి ధర్మమాఅని అదిగూడా అనుభవించబోతున్నాడు ఇంతకీ వీణ్నెందుకు పోలీసులు పట్టుకున్నట్టు ? "అసలు సంగతేందయా నీకేమీ తెల్వదా ?" గోవిందయ్యని అడిగాడు.

"నాకు ఎవరేం జెప్పలేగని, ఈ మధ్యన సారలొల్లి ఐతాందిగద. దాంట్ల మీవోడికి ఏమున్న సంబంధమున్నదేమొ ! అందుకే పట్టుకపొయిన్రిగావచ్చు." అన్నాడు గోవిందయ్య.

"నేను నమ్మ ! మావానికి అటువంటి సంబంధాలు ఏమిలెవ్వు. కాలేజిపోరగానికి సారపంచాయితి నమందమేంది ?" కనకయ్య అన్నాడు.

"ఓ సారూ ! మనుసులు మంచోల్లుగానీ శెడ్డోల్లుగానీ పంచాయితులు, శడాయితులు అయినప్పుడు సంబంధమున్నదనిపిస్తే అందర్ని పట్టుకపోతరు పోలీసులు. ఎసుమంటోడు ఏందనిసూడరు" అన్నాడు గోవిందయ్య.

"అంటె ఇప్పుడు మనం నడుస్తానంగద. ఇక్కడేదన్న జరిగిందనుకో ! దీంట్ల మనిద్దర్ని ఇరికిస్తరా ?".

"తల్సుకుంటె శణంపట్టది. పోలీసులబలం మీకేమెర్క సారూ !" గోవిందయ్య నవ్వాడు.

పోలీసుస్టేషను వచ్చింది. గోవిందయ్యా, కనకయ్యా లోపలికడుగుపెట్టారు. తెరుచుకున్న పులినోరు లాగావుంది స్టేషను. దారికిరెండువైపులా ఇటికముక్కలు కోణంగాపాతి పులికోరల్లా తెల్లగాసున్నం రంగుతోవున్నాయి.

గేటుదాటుతోంటే కనకయ్య పంచప్రాణాలూ విలవిలలాడాయి. రోడుమీదినుంచి తెలిసిన వారెవరన్నా చూస్తున్నారేమోనని తలవంచుకుని నడిచాడు.

"హూత్ ! ధూత్ !!" ఎవడో పశువుల్ని అదిలిస్తున్నట్టుగాతోచి తలెత్తాడు కనకయ్య.

962

"ఎవడవురా ? సక్కగ నడ్సుకుంటత్తానవు ? ఛూట్ !" చేతిలోలాఠితో కనకయ్యని ఒక్కటివేశాడు కానిస్టేబులు.

గోవిందయ్య వారించేలోపలే కనకయ్య పిర్రిలు చురుక్కుమన్నాయి, నిశ్చేష్టుడై ఆగిపోయాడు. కళ్ళలోనీళ్లతిరిగాయి.

"సారుకుతెల్వది, మాఫ్‌కరోభాయి !" అన్నాడు గోవిందయ్య కనకయ్యని పక్కకిలాగుతూ, పోలీసు వెనుదిరిగాడు.

"పోలీసుస్టేషన్లకు పచ్చేటపుడు ఎదురుంగ రావద్దుసార్ ! గీ పక్కెంబడి రావాలె. అమీన్‌సాబుకు ఎదురుంగరావద్దు" గోవిందయ్య చెప్పాకగానీ కనయ్యకు తనుతిన్న దెబ్బకి భాష్యం అర్థంకాలేదు. కళ్లలో ఊరిననీళ్లు చెంపలమీదుగా కారాయి. ఎంతఅవమానం ! పోలీసుఅహంకారం ఇంత వికృతరూపంలో వుంటుందా ?

పక్కనుంచినడిచి స్టేషను అరుగెక్కారు, ఇందాకా దెబ్బగొట్టిన పోలీసే మళ్లీవచ్చి ఏమీఎరగనట్టు "ఏంగావాలె ?" అన్నాడు పురుగులతో మాట్లాడుతున్నట్టు.

"మా పిలగాన్ని పట్టుకచ్చి(నట. ఎందుకోతెల్వది. అమీన్‌సాబుతోటి మాట్లాడాలె సార్ !" అన్నాడు గోవిందయ్య వినయంగా.

పోలీసు కాన్‌స్టేబుల్ని "సార్" అనటం కనకయ్యకి చిత్రంగాతోచింది. అతనిమనసు ఉద్వేగంతో కుతకుత ఉడుకుతోంది.

"ఏవాడ మీది ?" కానిస్టేబులడిగాడు.

"కాపువాడ" గోవిందయ్య చెప్పాడు. కానిస్టేబుల్ వెనుదిరిగి వెళ్లిపోయాడు. ఇంతలో మరొకడువచ్చి "క్యాహోనా ?" అన్నాడు ఉర్దూలో.

గోవిందయ్య వాడికీ అదేపాఠంచెప్పాడు. వాడికిచెబుతుంటే ఇంకొక పోలీసు వచ్చాడు. వాడికిచెబుతుంటే మొదటివాడువెళ్లి దూరంగా వేపచెట్టుకింద నిలబడి సిగరెట్టు అంటించాడు. రెండోవాడు అంతావిని ఇద్దర్నీ అనుమానంగాచూస్తూ వరండా మూలతిరిగి మాయమయాడు.

కనకయ్యకి, గోవిందయ్యకీ ఏమీ అర్థంకాలేదు. అడిగినవాడు జవాబుచెప్పడేం?

"ఏందయా ! అన్ని అడుగుదేగని జవాబుు చెప్పరేంది ?" కనకయ్య గోవిందయ్యతో అన్నాడు.

963

"పోలీసు మామూలా అట్లనేవుంటదిసార్ !" గోవిందయ్య నవ్వాడు.

ఇంతలో కనకయ్య మాస్టార్ని కొట్టిన పోలీసువచ్చాడు. "రాండ్రి అమీన్‌సాబ్ పిలుస్తాండు" అని వెనుదిరిగాడు. కనకయ్యా, గోవిందయ్యా అతన్ననుసరించారు.

యస్సయి మోజెస్ కుర్చీలో దిగేసినట్టుకూచున్నాడు. అతడి ఛాతీకీ, పొట్టకీ భేదంతెలీకుండా వుంది. దానిమీద అడ్డంగా ఓబెల్టునిచుట్టి దానికోపిస్తోలు తగిలించుకున్నాడు. గుండ్రిని ముంతకి చిల్లిచేస్తే అతని కళ్ళవుతాయి. చెంపలనిండా రెండు సీసాల బీరుపోస్తే ఎలావుంటాయో అలావుబ్బివున్నాయి. పెదాలు రక్తాన్నితప్ప మరి దేన్ని ముట్టనని ప్రతిజ్ఞచేసిన వాటిలా ఎర్రగావున్నాయి. కనకయ్య మేష్టార్ని చూడగానే

"ఏం గావా(లా ?" అన్నాడు దర్పంగా.

కనకయ్య ఉలిక్కిపడ్డాడు. ఎవర్నీ ఇంతఅమర్యాదగా పలకరిస్తున్నాడు ?

గోవిందయ్య చేతులుకట్టుకుని నిలబడ్డాడు. "ఈనె హైస్కూల్ల టీచరు. వీల్ల పిల్లగాన్ని మీరుపట్టుకచ్చిండ్రిట, ఎందుకో తెల్సుకుందామని...." నసిగాడు.

"హైస్కూల్‌టీచరైతె అమెరికా ప్రెసిడెంటా ? చేతులు అట్లపెట్టినిలబడ్డ వేందిరా ? నీ కొడుకునెందుకు పట్టుకచ్చిండ్రిని అడుగడానికొచ్చినావు ? అవుసు. ఐతేంది ? రాడికల్సుతోటి తిరుగుతే బొక్కలతోస్తం. ఏందయితే?" యస్సయి తన అధికారపు డిగ్రీని కొలవడానికి వీల్లేనంత స్థాయిలో అన్నాడు.

కనకయ్య దిమ్మెరపోయాడు. యస్సయి అంటే గ్రాడ్యుయేట్ అయివుంటాడు గనక శాస్త్రమర్యాదగా మాట్లాడతాడనుకున్నాడు. ఎదురుగా కుర్చీలున్నాకూచోమని అనలేదు సరికదా పైవించి దుర్భాషలు !

"ఏమె మిటకరించిసూస్తానవేందిరా ? ఏంది సంగతి ? కనకయ్యని చూస్తూ అన్నాడు యస్సై.

"ప్చ.... అదికాదండీ !" కనకయ్య అనబోయాడు.

"ప్చ అంటానవు ? నీకే ఇంతయాష్ట అయితాందా ? స్కూలు టీచరువేమె గాదుర మాదర్చోద్ ! ఎక్కడెట్ల మాట్లాడాల్నోతెల్వదా ?" యస్సయిలేచి లాఠీని టేబల్‌మీద కొట్టాడు.

కనకయ్య అదిరిపడ్డాడు. "ఇదేమిటండీ! చెప్పేదివినకుండా...."

964

"లంజకొడుకా ! నువ్వేర నాకుజెప్పేది ?" యస్సయిలేచాడు.

* * * *

"ఈ ఎదపయాపారంకన్నా హాయిగా మెడ్రాసెలో సినేమాలుతీస్తూ కూసుసుంటే సరిపోయేది. మన గుమాస్తాపంతుళ్ళలాగ ఆడ చెట్లకింద తలకుమాసిన రచయితలు అనేకం ఉంటారు. ఎవుడో ఒగుణ్ణిబట్టుకుని సింగిలిడ్లీ, అరకప్పు కాఫీ ఇప్పిస్తే అదిరిపోయేట్టు కథరాసిచ్చేవాడు. దాన్ని లోబడ్జెటు పిచ్చరుగా లాగిపారేసి జిల్లాలవారీగా అమ్మితే అప్పటికప్పుడు పీడావదిలిపోయేది. ఎదపముండాగోల! ఈ సారా అంత కంపుయవారం మరోటిలేదనుకో!" రాజుగారు చుట్టముట్టించి గుప్పునపొగవదిలి "దాన్లో ఇంకోసుకముంది ఓపిచ్చరు తయారుకాగానే అమ్మేసి రెండోపిచ్చరుకీ ప్లాన్ చేసుకోవచ్చు. ఇదలాకాక్కాదే! రాడికల్సూ వాళ్లబొందాసూ!" అన్నాడు

"మీరలాగంటే యెలాగండే! రాడికల్సు గూడా సినేమాలు తీసేత్తన్నారండే! ఆల్లు మనసారా బిజినెస్సులోనూ దిగారు. సినేమాల్లోకీ దూకేరండి! సారా కాంటాక్టల్లో పెట్టుబడేంలేకుండా మేం రాడికల్సుమి సుమా అన్జెప్పి బెదిరించి వాటాలు దొబ్బేస్తున్నారు. సినేమాలుగూడా సవగ్గా మనకంటేగూడా మరీసవగ్గా తీసేస్తున్నారంటే నమ్మండి" సారా సిండికేట్లో పావలాపార్ట్నర్ అన్నాడు రాజుగారితో.

రాజుగారు నవ్వారు. "ఇలకూర్కోసో" అన్నారు దయగా. పావలాపార్ట్నర్ భక్తిగా మోడామీద కూచున్నాడు.

"నీకిప్పుడు ధర్మసూక్ష్మం ఒగటిజెప్తానిను. వ్యాపారానికి పునాది మానవుడి బలహీనతే అన్జెప్పి శాస్త్రంజెప్తోంది. అది పూరాగా నిరూపణ అయిందిగూడానూ. సారాకీ సినేమాకీ తేడా ఏటన్నావుందా? వుంటే అదేంటోజెప్పు! అప్పుణ్ణీకాలిబర్ నాకు అర్ధమైద్ది" అన్నారు రాజుగారు.

పావలాపార్ట్నర్ చెవివెనకా, ముక్కుమీదా, చెంపలపక్కనా గీక్కుని "యురేకా" అన్న ఫోజులో అన్నాడు.

"సారాని మగాళ్లమాత్రివేతాగుతారండి. సినేమాని ఆడా, మగా అందరూ సూత్తారండి! అదీ తేడా!"

"ఛీ ఛీ! నా సిండికేట్లో నువు పావలాపార్ట్నర్ వెలా అయావయ్యా! నువ్విలాటి బుర్రతక్కువవాడివని తెలిస్తే మినిస్టర్నిజేసి కూసోబెట్టేవాడిని. సినేమాకీ సారాకీ కనెక్షను తెలీకుండా బిజినెస్సులోకెలాదిగావయ్యా"! [illegible] విసుక్కుని "వినుమరి, సినేమాకన్నా సారాకి ధరెక్కువ. వొందగ్రాములసారాకి కనీసం ఎక్కడైనా రెండున్నరకన్నా తక్కువుండదు. సినేమాఖరీదు ఎక్కడైనా ముప్పావలాకి ఎక్కు

వుండదు. వందగ్రాముల సారానిషా అరగంటయితే, రెండుగంటల సినేమానిషా రెండేళ్లపైగా వుండిద్ది. అవలంతకన్నా ఎక్కేసేనుకో. నాచిన్నప్పుడెప్పుడో కాంచనమాలని జూసేను. ఆవిడకళ్ళని మరిపించగల గుంటఎవర్తీ ఇంతవరకూ సినేమాఫీల్డులో రాలేదు. అంటే నాలాంటి యాపారపేత్తనే జయించేలక్షణం సినేమా కుందంటే ఇగ దానిఖలవ నీకుతెలిసుండాల ఈపాటికి! ఈ రెండుగూడానూ జనాన్ని ఖుసిపించి డబ్బులుగొరిగేటియే! కాబట్టే సినేమాకీ సారాకీ కనెక్షను. ఇగపోతే రాడికల్సు సినేమాలు తీత్తన్నారన్నావే! అదినేన్నమ్మను. రాడికల్సును ఉపయోగించు కునేవాళ్లే అలాంటిసినేమాలుతీత్తారు. ఎలాగంటే ఈకాలపు ఆడపిల్లలకి పెళ్ళిళ్లవు తాయా అంటూ నేనూ ఒకసినేమాతీశాను. ఎందుకూ? అది నాకోసమస్యగాబట్టా? అది ఈరోజుల్లో పేద్దసబ్జెక్టు. దానిమీద సినేమాతీస్తే గ్రాండుసక్సెసు! అంచేత సినేమాలాగించేసు. దాంతో ఏటయిందోనికెరికా? సామాజికస్పృహో దానిబొందో అదేదోనాకుందనీ, దానెమ్మాశిగదరిగివన్ని పెశంసలూ, డబ్బులూగుప్పించేసేరు జనం. అలాగే రాడికల్సుపేరుతో కొందరు సినేమాలుతీస్తున్నారు. ఆ సినిమాలకీ నాకూపోలికేలేదు. నా సినిమాల్లో వీరోయిన్ల రొమ్ముమీదిగుడ్డతియ్యరు. మరి రాడికల్ సినిమాలో అన్నీఅవుపడ్తాయి, అదేంటంటే సన్నివేశం, సహజత్వంఅంటాడు. నా వీరోయిను సడుంవూపిందానికీ, నీ వీరోయిను కాలిపిక్కలు చూపిందానికీ తేడా ఏమిటీ? ఏమీలేదు. నీదోముసుగు, నాదోముసుగు! సముద్రంలో బంగారంవుంది. నువ్వోదారినించి వస్తున్నావు. నేనోదారినించి వస్తున్నాను. ఇంతకుమించి తేడాఏమీ లేదు. సొమ్మునిపంచుకునేదగ్గిర నాతో పోటీపడేవాడివి నాకన్నా వేరేఎలాగవుతావు? అంచేత నీదీ నాదీ ఒకేజాతి!!" ఆరిపోతున్న చుట్టని గుప్పునలాగి పొగనివూది "ఐతే నువ్వే అసలురాడికల్వని నేనుఅనను. అల్లుయేరేవున్నారు. అల్లతోనాకు ప్రమాదవే. కాని చెప్పేదేటంటే నువు రాడికల్వికాదు. నీతోపెమాదంలేదు. అదీసంగతి" అన్నారు రాజుగారు.

పావలాపార్ట్నర్ గిరుక్రిసతిరిగి అడ్డంపడిలేచి "ఏమిటండీ మీతెలివి? మీ దగ్గిర ఎంతజ్ఞానంవుందీ?!" అని ఆశ్చర్యపోయాడు.

"సారాకాంట్రాక్టరుదగ్గిరా, బ్రోతల్స్ బ్రోకర్‌దగ్గిరాతప్ప నిజమైనజ్ఞానం ఎవుడిదగ్గిరావుండదు. ప్రపంచభాషసమస్తం సారాలోనూ, సానిదానిలోనూ తూరాడు భగవంతుడు! ఇదిశాస్త్రజ్ఞానం" రాజుగారు చిరునవ్వునవ్వారు.

పావలా కాంట్రాక్టరుబుర్ర కాంతివేగంతో సెకనుకి రెండులక్షల తొంభయి తొమ్మిదివేల ఏడుపందల కిలోమీటర్ల వేగంతో అరసెకనుపాటు తిరిగి ఆగింది.

966

* * * *

"రాత్రిలొల్లిల నువు ఉన్నావుర ?" శివయ్య కొడుకుని అడిగాడు.

"ఏలొల్లి ?" కొడుకు అన్నాడు

"అలంకార్ టాకీసు దగ్గర సారదుకానంల ఎవన్నో నరికి రొండుముక్కలు జేసిన్రటగద !" తండ్రి మాటలకి కొడుకు నవ్వాడు.

"ఎవడే నీకు జెప్పింది ?"

"ఏమో అందరు అనుకుంటాండ్రిరా !"

"అంత అబద్ధం సారదుకాంగ్లు బందుపెట్టమన్నరు గద రాడికల్సు ! ఆ సార దుకానపోడు జబర్దస్తీగ సారదీస్కచ్చి నకుప బొయింది. అప్పుడు రాడికల్సుపోయి సారటిన్నును రొండుముక్కలు జేశిండ్రి మనిషినిగాదు." అన్నాడు నవ్వాపుకుంటూ.

"మరి కతగిట్లబుట్టిందేమిరా: బాంబులతోని, గొడ్డండ్లతోని, కత్తులతోనిపోయి సారతెచ్చెటోన్ని నడిమికినరికి, తాగెటోల్లనుగూడ కొట్టి నానాగంద్రిగోలం జేసిన్రిట గాదుర." తండ్రి సంశయంగా ప్రశ్నించాడు.

"ఎహె ఈకెకు తోకబుక్తది. ఉన్నది గింతయితే గంతజేత్తరు నేను జెప్పిందే కరక్టు" కొడుకు నిశ్చయంగా అన్నాడు.

"మరి నువ్వు లేనేలేవేమొగాదుర. కచ్చితంగ ఎట్ల జెప్పుతానవు ?" శివయ్య అనుమానంగా చూశాడు కొడుకుని.

"నేనెందుకు పోయిన ఇదువరదాక ట్యూషను కేపోతిని రోజు అటేపోతాన నాకు దీని సంబంధమేంలేదు" కొడుకు మాటల్లో నిజాయితీ కన్పించింది శివయ్యకి "నిజ మేలే ? వాడు రోజూ టయిముకిపోయి టయిముకే వస్తుండే" అనుకున్నాడు.

"సరె అన్నంతిని ఈరాత్రికి ఎక్కనన్నదోస్తులఇంట్ల పండుకో! ఎందుకైన మంచిది." అన్నాడు.

"ఎహె! నేను ఆలొల్లిల లేనంటె ఇనవేంది!" కొడుకు విసుక్కుని లోపలికి వెళ్ళాడు.

శివయ్య కొడుకు పోయినవైపే చూస్తూ జేబులోంచి బీడీతీసిముట్టించి వరండాలో మంచం వాల్చుకుని ఒరిగాడు. బీడీ అయిపోయేంతలో ఎదురింటి పుల్లయ్య వచ్చాడు. "పన్నావే శివన్నా" అంటూ.

శివయ్య బీడిపారేసి లేచికూచుంటూ "లేలే! ఏంసంగతి?" అన్నాడు.

967

"సంగతేమున్నది? రాడికలోల్ల ముచ్చట ఇన్నివా! మనుసులనే నరికిపారేత్తా నరిట" అన్నాడు పుల్లయ్య.

శివయ్య నవ్వులాపుకుని "ఎవడయ్య జెప్పింది? సారధర తక్కువజెయ్య మనుడు గూడ తప్పేనా? ధరతక్కువజేశేదాక దుకాండ్లు బందుపెట్టుమన్నారు. ఇన కుంట నడుపుతె పోయి బందుబెట్టిత్తాండ్లు. దీంట్లతప్పేమున్నది? వాడెవడో కొత్తోడు వచ్చి నెలకు ఇరవైలచ్చలు పాటపెంచిండట. ఆసొమ్మంత యాన్నుంచిఎల్లుద్ది? మన మీద నూకిండు. అంటె లీటరుసారకు పదిరూపాయలు పెంచిండు. ఎవడుగట్టాలె ఇదంత?" అన్నాడు.

"మరి తాగుడుబందుజేస్తేపోలే?" అన్నాడు పుల్లయ్య. "ఇగో పిచ్చిముచ్చట్లు బెట్టకు, తాగుడుబందుజేసుడంటె కుదిరేపనేనా? సరింగజెప్పు అదిఅసలుఅయిద్దా? కాదుగాకకాదు. అంతటితోటి ఇగ ఎట్లయినా తాగుతానని రేట్లుబెంచుతావు? ఎవడవురా నువ్వు? నీకోసంగతెరకేనా? కలెక్టరు పాటమీద ముప్పైపర్సెంటు పెంచినోనికే కాంట్రాక్టుఇస్తనని కూసున్నడట. ఎర్కేనా? అందుటితోని ఈరేటు మనకచ్చింది. ఇదంత గౌర్మెంటు పుట్టిచ్చిన లొల్లేగని సారముస్తాజర్ల పనిగాదు. పాపంవాల్లు నల్లగ మాషులాజేస్కోని యాల్లపొద్దుగాల బయటపడ్డామనే సూస్తరు. ఏ పార్టీవోడు అడిగినా సంవాలిచ్చి పంపిత్తరుగని పంచాయితీకి దిగరు. ఎందుకంటె యాపారం ఎల్లాలెగద!" అన్నాడు శివయ్య.

పుల్లయ్యలేచి లుంగీని పైకికడుతూ "నువుజెప్పినయన్ని నాకుతెల్వదా? పోలీసుల అరాచికం ఎట్లున్నదో సూడమని జెప్పటానికి అచ్చిన. కనుకయ్య సారు కొడుకును పట్టుకుపోయినరిట నా కొడుకుయాడవున్నాడని సారుపోతె ఆయినెనుగూడ రిట్టికొట్టి పంపిస్రిట గట్ల నడుస్తోందిరాజ్యం." అన్నాడు.

"అందుకే మరి ఇది పోలీసు రాజ్జెం తుపాకి రాజ్జెం" శివయ్య అన్నాడు.

"అట్లనేవున్నది వీని పెండ్లాల మాదుగులు........." పుల్లయ్య వెనుదిరిగి పోడంతో మిగతా మాటలు వినపడలేదు శివయ్యకు.

పక్కనేవున్న వైష్ణవాలయంలోంచి ఏదోరికార్డు గోలగావిన్పించటంతో "వీలొల్లి పెండ్లాం........! ఇగ తొమ్మిది బనాది? మొదలుబెట్టినుర్రి" అని మంచం మీద ఘుసుగుతన్నాడు శివయ్య.

968

కొడుకు అన్నంతిని బయటికి వెళ్ళటం అతడికి తెలీదు. ఏరాత్రో ఉలిక్కిపడి లేచాడుశివయ్య ఎదురుగా వీధిలైటు వెలుతురులో పోలీసులు కన్పించారు.

"లే లే! నువ్వేనారె ఇంట్ల మొగోనివి? నీ కొడుకు యాడున్నడు? తలుపులు తియ్యమను" ఎవడో అంటుండగానే ఇంకొకడువెళ్ళి తలుపులు బాదాడు.

ఈ గొడవకి శివయ్య భార్య తలుపులుతీసింది. పోలీసుల్నిచూసి కీడుశంకించింది. "ఏంది ఏంది" అన్నది కంగారుగా బయటికివస్తూ.

పోలీసులు శివయ్యని చెయ్యిపట్టుకుని లోపలికి లాక్కొచ్చారు. "ఏదీ నీ కొడుకు? ఎక్కడున్నడు?" మొరటుగా అడిగారు.

"ట్యూషనుకని పోయిండు అక్కన్నే దోస్తులింట్ల పండుకుంటడు" శివయ్య చెప్పాడు బెదురుతూ.

"దోస్తుల ఇల్లెక్కడ? పోలీసు అడిగాడు.

"ఏమో మాకేంతెల్సు? మేమెందుకు జూడబొయినం?" తల్లి అన్నది.

"మరి ఏమెర్కనే నీకు దొంగముండా: గాడుదులందర్నికని దేశంమీదపారేసు డెరికేనా? నీ కొడుకు అంతమొగోడా? సారమాములా బందువెట్టిస్తడా?" పోలీసు ప్రశ్నించాడు.

"అదంత మాకేమెరుకనయ్యా! బయట వాడేంజేస్తదో మాకెట్లతెలుస్తది" శివయ్య అన్నాడు.

పోలీసు శివయ్యని ఈడ్చితన్నాడు. "బలిశనాదిరలంజూడకా! అడిగిందానికి జెప్పరాఅంటె వదురుతానవు?" మళ్ళీతన్నాడు. భార్య అడ్డురాబోయింది. పోలీసు ఆమెని లాగిపారేశాడు ఆస్త్రీ విసురుగా దూరం వెళ్ళిపడింది.

"లష్మి! మీకెందుకే ఈ యవారాలన్నీ! లంగలతోని దొంగలతోనితిర్గి సంపాయించుకతింటానారు? ఖానూన్ ఊకుంటదనుకుంటాన్రా? కత్తిబెట్టి చంపుతం ఖాంచెత్?" ఆమెని తన్నడానికి అధికారపునాదాలు ధరించిన పోలీసు బూటు పైకి లేచింది.

* * * *

పూర్వం ఏకశిలానగర ప్రాకారంగాఉన్న కోటగోడకాస్త దూరంగా కన్పిస్తోంది ఆ పటమందీ ఆగారు ఒకడు లోపలికి నడిచాడు. అది సారాదుకాణం.

969

"బందుపెట్టాల్నని చెప్తె ఎందుకు నడుపుతానురి?" ఆ యువకుడు యజమానిని ప్రశ్నించాడు.

గద్దెమీదకూర్చున్నతను తలెగరేశాడు. "ఎందుకు బందుపెట్టాల్నయా? ఏం సంగతి?" గద్దెదిగాడు.

"ఎందుకుబందుపెట్టాల్నా?" వచ్చినయువకుడు సారాజాడీని కిందికిలాగాడు. అదికిందబడి భళ్లనబద్దలైంది. సారాతాగుతూఉన్న ఒకరిద్దరు బయటికి పారిపోయారు.

ఆ గొడవకి బయటవున్న మిగతావారుకూడా వచ్చిచేరారు. బల్లల్ని బెంచీల్ని విరక్కొట్టారు. యజమానిని పట్టుకునితన్నారు.

ఆ సారాదుకాణానికి ఫర్లాంగుదూరంలో పోలీస్ స్టేషన్‌వుంది. వార్త ఎలా చేరిందోగానీ హెడ్‌కానిస్టేబుల్ సుబ్రిహ్మణ్యం నలుగురు పోలీసులతో పరిగెత్తు కొచ్చాడు. సైకిళ్లు దిగీదిగగానే లాఠీలతో ఉరికారుసారాకొట్లోకి,

వాళ్లంతా మఫ్టీలోవుండటంవల్ల సారా కాంట్రాక్టరు మనుషులనుకున్నారు ఆ యువకులు. వాళ్లు ఎవరైనా గానీ వాళ్లతో గొడవ పడదలుచుకోలేదు. అందుకే లోపలఉన్న యువకులు బయటికివచ్చి కోటగోడవైపు పరుగుతీశారు. పోలీసులు వెంబడించారు. కానీ యువకులు అందేటట్టు కన్పించలేదు. పోలీసులు కొంత దూరం తరిమి వెనుదిరిగారు. హెడ్‌కానిస్టేబుల్ సుబ్రిహ్మణ్యంమాత్రం మరింత ముందుకువెళ్ళి తరిమాడు. ఒకయువకుణ్ని వెనగ్గావెళ్లి కాలరందుకున్నాడు. ఆ యువకుడు ఆలస్యంచేయలేదు. కత్తితీసి సుబ్రిహ్మణ్యాన్ని పొడిచాడు. తప్పించుకోవడానికి వెనక్కి వంగాడు సుబ్రిహ్మణ్యం. కత్తిఅతనిడొక్కకి కాస్తంతరాచుకుని పోయింది. పెద్దగాయమేమీకాలేదు. గీచుకుపోవటంవల్ల రక్తంమాత్రం బాగా కారుతోంది.

మిగతాకుర్రాళ్లు దొరక్కుండా తప్పించుకున్నారు.

పోలీసునే పొడవగలిగిన ధిక్కారానికి పోలీసులకి వెర్రెత్తింది. చేతిలోఉన్న లాఠీలతో అక్కడవున్నవాళ్ళని ఇష్టంవచ్చినట్టు బాదారు బండబూతులు తిడుతూ.

* * * *

రాజుగారు గదిలోకిరాగానే కలెక్టరు చిరునవ్వునవ్వాడు.

"రండి రండి" ఆహ్వానించాడు.

రాజుగారివెనక కంపెనీ ఆడిటర్‌గూడా ఓఫైలు పట్టుకుని వచ్చాడు. ఆఫైల్లోంచి ఓ కాగితంతీసి రాజుగారికి అందించాడు ఆడిటరు. రాజుగారు దాన్నందుకుని కలెక్టరుకి ఇచ్చాడు.

"ఏమిటిది ?" కలెక్టరు అడిగాడు దాన్నందుకుంటూ.

"మెమోరాండం ! పరిస్థితి ఇలాగేవుంటే వున్నన్నిరోజులు గవర్నమెంటు రెంటల్ మేంకట్టలేం. దానికి రాయితీఇవ్వాలని ఎక్సైజు సూపర్నెంటుగారికి మెమోరాండం ఇచ్చాం. దానికాపీఇది." రాజుగారు అన్నారు.

కలెక్టరు నొసలుముడిచేశాడు. "పరిస్థితి ఇలాగే ఎందుకుంటుంది ? చాలా మందిని అరెస్టుచేస్తున్నాం. త్వరలో అణిచేస్తాం"అన్నాడు.

"నాకు నమ్మకం కుదరటంలేదండి. మీ పోలీసుల్నే పొడిచి అపతలపారేస్తుంటే ఇక మాకెలా ధైర్యంఉంటుంది చెప్పండి ?"

"పొడిచినవాడు దొరికాడుగద వాడిచేష్టలు వలిచేశాం మరోదెవడూ మళ్లీ అలా చేయకుండా. పోలీసులుగూడా దిగజారకుండా వాడికి అసిస్టెంటుయస్పయి, ప్రమోషనూ, ఇంటిజాగా, పదిహేనువందల నగదూఇచ్చాం. దాన్ని మా డిపార్టుమెంటు ఛాలెంజ్‌గా తీసుకుంది. నలిపిపారేస్తాం వెధవల్ని" కలెక్టరు ఆవేశపడ్డాడు.

"ఈలోపల మా అదాయం పడిపోతుందే. ఈ దసరాసీజన్లో బిజినెస్సంతా పోయింది. అసలుఉండేలాభాలన్నీ ఇప్పుడే. మామూలురోజుల్లో ఏముంది ? మాకు రోజుకి లక్షరూపాయల రాబడిపోతుంది. ఇంక ఈ మాములా నడిపి ఏంలాభం ?"

"పోలీసుల్నిచ్చాంగదా ! షాపులు నడపడానికి ?" కలెక్టరుప్రశ్నకి రాజుగారు నుదురుకొట్టుకున్నాడు.

"అదేంలాభంనండీబాబూ ! తాగడానికి వచ్చినవాడు పోలీసుల్నిజూసి ఎనక్కిరిగెళ్ళిపోతున్నాడు. అసలే ఎప్పుడు ఎవుదొచ్చి ఏంజేస్తాదోననిభయం. బనాతెగించి తాగటానికొస్తే పోలీసులు. పోలీసులముందర ఎవడుతాగుతాడండీ ?"

"మీరేం వర్రీఅవకండి. ఇది ఇకనుంచీ మీసమస్యకాదు. మాకుఛాలెంజి. దీని అంతుచూస్తాం" కలెక్టరు అన్నాడు.

* * * *

అదినగరంలో బాగా సారా అమ్మడయేషాపు. మామూలురోజుల్లో అక్కడ కాల్చిన మాంసంముక్కలు, వేయించిన ఉప్పుశనగలు అమ్మేవాడు రోజుకి రెండొందలు సాంపాయించగలడు. అలాంటి సారాకొట్టు ఇప్పుడు చిన్నబోయివుంది. బదారుగురు పోలీసులు, ఎముకలుదొరుకుతాయే నని వచ్చిన రెండుకుక్కలు, మూడునాలుగు

సందులూ మాపరిం వున్నాయక్కడ. దానికాస్తదూరంలో సిటి బస్సుస్టాండుపుంది. ఆ బస్సుస్టాండువెనక పెద్దడ్రైనేజీవుంది.

సాయంత్రం ఆరుగంటలవుతుండగా అక్కడ జనం నేల ఈనినట్టు వుంటారు. అలాంటివేళ ఒకరిక్షాలో ఒకాయనవచ్చి బస్సుస్టాండులో రిక్షాదిగాడు. జేబులోంచి చిల్లరతీసి ఇవ్వబోతుండగా అతడిపక్కనుంచి ఒకజీపు శరవేగంతో అతన్ని తాకినంత పనిజేసి దూసుకుపోయింది. ఆ అదురికి అతను తూలాడు.

అంతజనంలో అది అంతవేగంగా ఎలావెళ్లగలిగిందో ఎందుకువెళ్ళిందో తెల్సుకునే లోపలే మరోజీపు అతన్ని నిజంగానేతాకి దూసుకుపోయింది. అతడు కిందపడి విభ్రాంతుడై లేవబోతుండగా మరో ఐదారుజీపులు అలాగేరావటం పక్కసందులోకి దూసుకువెళ్ళటం జరిగింది. తాను డబ్బుఇవ్వాల్సిన రిక్షావాడు అపులేడు. జనం చెల్లా చెదురయ్యారు.

బారెడు పొడుగున్నబడిసెలు, బాకులు రయ్ రయ్మని దూసుకువచ్చిపడుతున్నాయి. అవి ఎవరికీ తాకలేదన్నమాటేగానీ తాకితే ఇద్దర్ని దూసుకపోగా మరి మూరెడు మిగుల్తాయి. జీపుల్లోంచి పోలీసులు తుపాకుల్తోనూ, మామూలుదుస్తుల్లో వున్న సారాకాంట్రాక్టరు మనుషులు బరిసెలు, దుడ్డుకర్రల్తోనూ దిగారు. రోడ్డుమీదా, సందుల్లో జనాన్ని భయపెట్టి పరిగెత్తించారు. జనం భీతావహులై పారిపోయారు. ఏం జరుగుతోందో, ఎందుకు జరుగుతోందో ఎవరికీ అర్థంకాలేదు

సారాకొట్లో మరీ తాగకుండా ఉండలేనివాళ్లు ఇద్దరు ముగ్గురు కూచునితాగుతున్నారు. కాస్తంత ఎక్కువైపోయిందేమో వాగ్వాదంలోకిదిగారు.

వాళ్ళవీపులమీదా, తలకాయలమీదా లాఠీలు మోగాయి.

“బాగతాగి ఒర్రుతున్నరేందిరా ?” పోలీసులు బ్యాండు బజాయించారు.

తాగుబోతులు లబోదిబోమన్నారు. “లంజకొడుకుల్లార! శేతులకట్టెలున్నాయని కొడుతారరి బోషిడికే ! మిమ్ముల నేమన్న అన్నామురా- ఓర్నీయమ్మ తలకాయెపలు గొట్టింతురో!” అని తిడుతూ ప్రతిఘటించారు.

పోలీసులు రెచ్చిపోయి తాగుబోతుల్ని పొర్లించి కొట్టారు. షాపుయజమాని గొల్లుమన్నాడు. “ఉకోండ్రి ఉకోండ్రి ఆయింత వచ్చేటోల్లను రాకుంట జేస్తరాఏంది? మీరుగిట్లకొడితే ఇంత ఎవడన్నవస్తడా దుకాండ్లకు ?” పోలీసులకు అడ్డంవెళ్ళాడు.

"ఐతె తాగి మమ్మల్నితిడ్తారా పీల్లు ?" పోలీసులు షాపువాణ్ని లాగేశారు.

నాల్లేమన్నరయా ? మీరేకొడ్తిరి" యజమాని వదల్లేదు. తాగుబోతులు తిట్టకం మానలేదు. పోలీసులు కొట్టడంమానలేదు.

* * * *

"కలెక్షనెంత" రాజుగారు అడిగారు.

"ముప్పైవేలండి !" జవాబువచ్చింది, క్యాషియర్నించి.

"ఛీ ఛీ ! ఈ పోలీసు నాకొడుకులవల్ల ఎంతమాత్రం లాభంలేదు. ఏమయినా రోడ్లమీద ఎగర్టమేగానీ అసలు పనిచాతకాదు. మనయాపారం నడవటానికి వీల్లకన్న రాడికల్సుతోనే మాట్లాడితే బాగుంటుందేమో !" రాజుగారిమాటకి తలాడించారు చుట్టూ వున్నవాళ్ళు.

"కానీ పెద్దశిక్కుండండే ! అసలు రాడికల్సు ఎవరు ? అల్లనాయకుడెవడు ? ఆడెక్కడుంటాడు ? ఆడితోమాట్టాడవేలాగ ?" ఇయన్నీశిక్కులుండే !"

"నిజవే. కాంగ్రెస్సుకీ, కమ్యూనిస్టుకీ అఫీసులంటూ తగలడ్డాయి. ఈల్లకేవీలేదు ఆ ఒగటితోస్తోంది. రాడికల్సుతో చర్చలకి మనం సిద్ధవేనని వాడితో వీడితో అనాలి. ఈమాట ఎలాగో వాల్లకిజేరుద్ది. అప్పుడు మనకి దారిదొరికిద్ది. ఇగంతకుమించి మార్గంలేదు" రాజుగారి మాటలకి చుట్టువున్నవారంతా తలాడించారు.

"కానండయా, ఈ చర్చలకి మనకి పనావిఏటి ? అల్లు ధరతగ్గించమంటున్నారు గదా, తగ్గిస్తావనా ? లేదనా ! తగ్గిస్తే ఎంతకని ?" ఒకడు ప్రశ్నించాడు. ఆ ప్రశ్నించినవాడు డిపోలో సారాని కొలిచిఅమ్మేవాడు.

"నిజవే. డిస్కషన్పంటూవున్నాక సంగతేంటి ? దేనిమీదమాట్లాడదాం ?" పావలా పార్ట్నర్ అడిగాడు.

"అసల్సంగతేంటంటే అల్లడిగేమూడ్రూపాయిలకి పంకగ్రాముల సారాబోసినా మనకినష్టంలేదు. కానీ మనం ఇప్పుడు నాల్గున్నరకి అమ్ముతున్నాంగదా. అంచేత అద్దరూపాయి తగ్గిత్తామని అంటాం ఒప్పుకున్నాడూ సరే ! మనికెట్టాగూలాభవే. లేసా చర్చలు విఫలంఅని పేరెట్టేసి ఎలాగూ పోలీసుఫోర్సు అదనంగా రాబోతూంది గనక దాంతోమామూలా నడిపేస్తాం" రాజుగారు చెప్పారు.

"కానీ మనం మూ(డూపాయలకి వంద(గాములు అమ్మినా మనకి లాభమేనని వాళ్లంటున్నారుగదా! అసలు మన బ్లాక్ షాపులసంగతి వాళ్లకెలాతెల్సు?" పావలా పార్ట్నర్ అన్నాడు.

"తెలీకపోడానికి ఇదేమన్నా స్మగ్లింగా?, గూడుపుఠానీయా? పబ్లిక్‌గా దోపు కోడమేగ! ఆమాత్రిం తెలీదేటి? అసలు నీకోసంగత్తెల్సా? మద్దగ్గిర షాపులు తీసుకున్న చాలామంది మాజీరాడికల్సేగా!" రాజుగారి మాటకి అడ్డొచ్చి.

"శ్శెశ్శె! ఆల్లురాడికల్సేంటండీ! పీతలు పట్టేనాయాళ్లు రాడికల్సు అలగుంటా రేటండీ! ఈలంతా దొంగ రాడికల్సు."

"రాడికల్సుకీ ఈలకీ సమ్మందం లేదంటేలేదు. ఉందంటే ఉంది. ఈలు గూడా ఒగప్పుడు రాడికల్సేగానీండి తర్వాత్తర్వాత పోలీసులబయానికీ, ఇతరగొడవలకీ తట్టుకోలేక బయటికొచ్చేసినారండి. కానీ ఈల్లకి ఎవురు రాడికలో ఎవురుకాదో ఆల్ల సమ్మందాలెలాగుంటమో అన్నీతెల్సండి. అంచాత ఈల్లని మనం ఉపయోగిచ్చు కోవచ్చండి ఈల్లద్వారనే కూపీలాగించి ఆల్లని అరెస్టుజేపించేది! ఎలాగుంది ఐడియా?" పావలా పార్ట్నర్ని రాజుగారు ప్రశంసా పూర్వకంగా చూశారు

"కూపీలాగిస్తావా? అదెలా?" అడిగాడు.

"ఎలాగంటే ఈల్లంతా మేంగూడా రాడికల్సువేఁ. మరిమాకు ఫలానాషాపులు ఇవ్వకపోతే మీమామిలా ఎలానడుస్తుందో చూస్తాం అని బెదరించి డిపాజిట్లుగూడా పెట్టకుండా మద్దగ్గిర షాపులు కొట్టేశారుగా. అంచేత మనకీ మాత్రిం సాయంజెయ్యక పోరు" పావలా పార్ట్నర్ అన్నాడు,

"అదినీజవేఁగాని సొంతపార్టీకే ద్రోహంచేసే నాయాళ్లు మరిమనతో సరిగా వుంటారంటావా? అవతలజిల్లాలోగూడా ఇలాగే రాడికల్సుమి అన్జెప్పి మామూలాలో వాటా కొట్టేశారు. నిన్నటికి నిన్న పక్కతాలుకామాములాలో ఏ పెట్టుబడీ లేకుండా ఇ పైపైసలావాటాగూడా ఇలాంటోడికి ఒగుడికిచ్చాంగద! రాడికల్సు పేరుజెప్పుకుని ఇలాం బెదవయేశాలేసేవోళ్ళకి అసలు రాడికల్సుకూపీ తెలుసుద్దా? ఈళ్ళని మనవేఁ నమ్మడంలేదే ఆళ్లెలానమ్ముతారు?" రాజుగారు అన్నారు.

"ప్రయత్నించిచూద్దాం నష్టమైతేలేదుగా" పావలాపార్ట్నర్ అన్నాడు. 974

* * * *

"మూడు ప్లాటూన్లు వస్తున్నాయి. ఈ రాడికల్ నాయాళ్లని కోసిముక్కలకింద ఏరుగుతాం" ఇనస్పెక్టర్ మోజెస్ జీపెక్కి అన్నాడు కానిస్టేబిల్స్‌తో. అని "బ్రాహ్మణవాడకిపోనీ" డ్రైవర్‌ని హెచ్చరించాడు. డ్రైవర్ గేర్‌నిగుద్ది ఆక్సిలెటర్ని తన్నాడు.

పెంకుటింటి ముందు జీప్ఆగింది. ఇంట్లో చేటలోబియ్యం పోసుకుని రాళ్లేరుతున్ననడివయసుస్త్రీ బయటికివచ్చింది. ఇన్స్పెక్టర్ మోజెస ఆమెని తోసుకుని లోపలికి వెళ్ళాడు. మంచాన్ని ఎత్తేశాడు బట్టలబీరువాని పడేశాడు. అతనితోపాటు వచ్చిన పోలీసులుగూడా ఇల్లంతా చిందరవందర చేశారు.

"ఎక్కడ నీకొడుకు ?" మోజెస్‌ప్రశ్నకి చేతలకీ అవాక్కయింది ఆ స్త్రీ.

"ఏమో తెలీదు." నీరసంగా అంది.

ఇల్లంతావెతికాక ఎక్కడా కన్పించకపోవడంతో మధ్యగదిలో ఆమెని ఇంటరాగేట్ చేశాడు మోజెస్.

"ఏదే నీకొడుకు ?"

"తెలియదయ్యా !" ఆమె వణికిపోతూఅంది. లాఠీతో ఒక్కటేశాడు మోజెస్. ఆమెఅరిచి నేలమీదపడింది.

"చెప్పు ఎటువెళ్ళాడు ?" లాఠీదెబ్బలు ప్రశ్నలు ఒకేసారి ఒకేవిధంగా ఆమెని గాయపరిచాయి.

"నాకేంతెలుసయ్యా ?" దీనంగాఅంది.

మోజెస్ విసురుగా కర్రనివిదిలించాడు. కర్రవిరిగిపోయింది. ఆమెసంతృప్తికరమైన సమాధానం చెప్పడంలేదు. రెచ్చిపోయి పక్కనున్న పోలీసుచేతిలోని తుపాకీ తీసుకుని కిందపడివున్న ఆమె మెడకంటె ఎముకలమీదా పక్కఎముకలమీదా తుపాకీ మడిమతో గుద్దాడు.

ఎక్కడో ఏవో ఎమికలు పటపటమన్నాయి. బాధతో ఆస్త్రీ గిలగిల్లాడింది. పేగులు చించుకునిపుట్టిన కొడుకుకోసం ఎముకలు విరగ్గొట్టుకుంది తల్లి !

* * * *

అక్బరూ, అశోకూ ఇద్దరూ కానిస్టేబుళ్లు రాత్రి ఏడున్నర గంటలప్పుడు కర్రలుపుచ్చుకుని గస్తీకని బయల్దేరారు. గంటసేపు అటూఇటూ తిరిగి ఓసారా కొట్లోకొచ్చారు.

975

అక్కడ బయట ముగ్గురు రిజర్వు పోలీసులూ లోపల ఒకతాగుబోతూ వున్నాడు. వీళ్లని చూడగానే ఆ తాగుబోతు పటుక్కున గ్లాసులోదంతా మింగేసి బయటపడ్డాడు. షాపువాడు అక్బర్నీ, అశోక్నీ కోపంగా చూశాడు.

"గావాడు గట్ల ఉర్కుతున్నడేందిరభై" అక్బరు బెంచీమీదకూచుని షాపువాడితో అన్నాడు.

"మిమ్ముల సూశినంక ఇంకవాడు ఉంటడా? గీ రిజర్వోల్లంటె యాన్నుండో వచ్చిసుర్రి మల్లపోతరు. మీరంటె ఇక్కడోల్లేనాయె, మొకాలు గుర్తుపెట్టుకోరా?" అన్నాడు షాపువాడు.

"సరెగని రొండుపొలునింపు సలిజంపుతాంది." అశోక్ టోపీని బెంచీమీద పెడుతూ అన్నాడు.

"ఉద్దెరా?" షాపువాడన్నాడు.

"ఉద్దిరఏంది? దసర మామూలియ్యకనేపోతివి. గీదినికే ఉద్దెరంటానవు?" అక్బర్ గుడ్లెర్రిజేశాడు.

"ఏంమూటగట్టుకపోతానమని మామూల్లియ్యాలె? శుడికే సచ్చేసావయితాంది".

"అరె పొయ్యేవయా! ఏదెట్లయితేంది? దసర లేకుంటబోయిందా మామూల్లు పొయ్యేటానికి? జమానసుంచిఉన్నది ఇయ్యాల ఏమొ కొత్తగజెప్తానవు" అక్బర్కి కోపంవచ్చింది. షాపువాడు గొణుక్కుంటూ రెండుగ్లాసుల్లో రెండుపందల సారా పోసిఇచ్చాడు. బయటఉన్న రిజర్వుపోలీసులు చూసీచూడనట్టు తలలు పక్కకులిప్పుకున్నారు.

"సోడలుగావాలె యాడున్నయి?" అశోక్ అడిగాడు.

"ఇంక అది పద్దీకిందికా?" ఏడ్వలేకనవ్వుతూ రెండుసోడాల్ని 'కుయ్యో' మనిపించాడు షాపువాడు.

"అరె మీరు గిట్ల డ్రెస్సుమీదనే తాగుతెఎట్లభై" షాపువాడన్నాడు.

"ఎవడు జూస్తున్నడురా తమ్మీ! మా యస్సయి మోజెస్గాడయితె పోలీసు జీబుతీస్కపోయి బ్రాండి కేసులకు కేసులే ఏసొక్కని గెస్టుఅవుసలకు తీస్కపోతడెరికేనా? డ్రెస్సుల ఉంటెఏంది? తాగి లొల్లిబెడ్తానమా?" అశోక్ సోడానికలుపుకుని సగం గ్లాసెడు ఒకేసారి ఖాళీచేశాడు.

976

అక్బర్ గూడా కాస్త తాగి గొంతుసవరించుకుని ఒళ్లు జలదరించినట్లుగా "అరే ఏందిరతమ్మీ! సార గమ్మతుగున్నది" అన్నాడు.

"గింతంత తాగంగనే తమ్ముడ్నయిన్నా? సారసంగతి నాకేమెర్క? డిపోల కెల్లి ఎట్లచ్చింది అట్లనేఅమ్ముతాన" అన్నాడు షాపువాడు.

"అట్లనా ఏదీ సీలుజూడనీ" అక్బరులేచాడు.

"అరె! ఏం సీలుజూస్తవయా! తాగిపోరాదు పోసినగద!" షాపువాడు వారించాడు అక్బరు మాటవినకుండా జాడీమీదిసీలు పరిశీలించాడు

"ఇదరావో భై" అశోక్‌ని పిలిచాడు.

"అరె! ఏంది భాయిసాబ్! గిదేనామర్యాద? మీరు పొయ్యమన్నంతపోస్తిని. మల్లగీకతలేంది?" షాపువాడు అశోక్‌ని ఆపబోయాడు. అశోక్ షాపువాడి చెయ్యిని తీసేసి గద్దెఎక్కి జాడీసీలుని చూశాడు.

అది పగులగొట్టివుంది. షాపువాడి వైపుచూసి నవ్వాడు అశోక్.

"ఏందిరా? సీలుతీసేసి కల్తీజేసి అమ్ముతానావు? ఇప్పుడు మేం రాబట్టిగాని లేకుంటె ఇండ్ల ఎంతసంపాయించినవో మాకు తెలువకనేపోయ్యేది" అన్నాడు.

"ఇగ రారా పోరాలకు దిగిందా యవారం" షాపువాడు గొణుక్కుని "కాదు భాయిసాబ్ రిజాలకెల్లి దించుతాంటె పలిగిపోయింది. గట్లజేస్తనా, వాకిట్ల పోలీసు లను బెట్టుకొని!" అన్నాడు

అశోక్ కిందికిదిగి "తాగు" అన్నట్టు అక్బరువైపుచూసి గ్లాసుని ఖాళీచేశాడు. షాపువాడు స్వయంగా ఆరెండుగ్లాసుల్నీ అందుకుని మళ్ళీనింపి రెండుసోడాలుగూడా పోసిచ్చాడు.

అక్బరూ అశోకూ ముసిముసినవ్వులు నవ్వుకున్నారు. పదినిముషాల తర్వాత అశోక్‌లేచి తలపైన టోపిపెట్టుకుని షాపువాడితో "తే" అన్నాడు.

షాపువాడు చెరిఐదురూపాయలిచ్చాడు. అక్బరు కోపంగా "క్యాసమజ్‌రహే?" అన్నాడు. బయటినుంచి రిజర్వుపోలీసు తొంగిచూశాడు "క్యాభాయ్" అన్నాడు నవ్వుతూ.

"కుఛ్ నై జర మజాక్!" అన్నాడు అక్బరు.

షాపువాడు గబుక్కున చెరోపదిరూపాయలు ఇచ్చాడు.

977

అక్బరూ అశోక్ లాఠీలూపుకుంటూ రోడ్డుమీదపడ్డారు.

"అరే! పైసపైసకు సస్తానంగదరా! ఈ రాడికల్స్‌లొల్లి జెయ్యబట్టి ఎవడు మామూల్లడిగినా ఇస్తలేదు. ఈండ్ల సంగతేందోగని రోజుపొద్దుగూకినాక పరీశానయితాంది" ఆశోక్ అన్నాడు.

"సహీహై యేతోపరీషాన్" అక్బర్ అన్నాడు.

ఆ సందులో ఒక పాన్‌షాపువుంది. అప్పుడు రాత్రి తొమ్మిదిదాటింది.

చలికాలం గావటంవల్ల జనం ఎవరూలేరు. అశోక్ ఆ పాన్‌షాపు దగ్గరఆగి "పాంచ్ చార్మినార్ గోల్డ్‌దేవో" అన్నాడు.

షాపువాడు ఇచ్చాడు. అశోక్ ఒక సిగరెటుతీసి అంటించుకుంటూండగా ఒక కుర్రాడు వచ్చాడు. అతడికి ఇరవైఏళ్లున్నాయి. గడ్డం అంగుళంమందాన పెరిగివుంది. భుజానికో సంచివుంది. అతణ్ని అనుమానంగా చూశాడు. "భుజానికి అవేంటియి?" అన్నాడు కుర్రాడితో.

"రంగు బ్రిష్‌లు" అన్నాడు కుర్రాడు.

"బ్రిష్‌లా? ఎందుకు?" నోట్లోనుంచి సిగరెటు తీశాడు అశోక్. కుర్రాడు బెదిరాడు.

అక్బరు వాణ్ని కాలరుపట్టుకున్నాడు. "అరేఏందిరా రాడికలోనివా? రాత్రిపూట గోడలమీద రాస్తానావుర" అన్నాడు.

కుర్రాడు అడ్డంగా తలూపాడు. "ఉహుఁకాదు. నేను ఇండ్లదర్వాజలకు రంగులుగిట్లఏస్త. రాడికల్నుకాదు" అన్నాడు.

"బిడ్డా! వల్లగున్నవు. గడ్డంబెంచుకున్నవు. సంకకు బ్యాగున్నది. దాంట్ల బ్రిష్‌లున్నయి. ఇంకేందిరో నువ్వు రాడికల్‌వే. చల్ నడువుబేటా! మీరు జెయ్యబట్టి ఈ సలిల సచ్చుకుంట తిరుగుతానం ఆద్మానిలేకుంట! నడువు నడువు" అక్బరు అతన్ని ముందుకుతోశాడు.

"అరె! నేను రాడికలుకాదు సార్! నాకేందెల్వది రేపు పొద్దుగాల రొండిండ్లు కాంట్రాక్టుబట్టిన. రంగులెయ్యాలె పోనీయిన్రి" బతిమాలాడు.

"నడువుబే. పిచ్చకుంట్ల నఖ్రాలుజేత్తానవు అప్నేకో చమ్కాదేతేరే? పంద్రాసాల్‌కే సర్వీస్‌హై" అశోకుడు లాఠీతో ఎడాపెడా బాదాడు.

978

* * * *

మూడుప్లాటూన్ల రిజర్వు పోలీసులు నగరంలో దిగారు. ఎక్కడచూసినా ఊళ్లో పోలీసులే. రాత్రి ఏడుదాటితే ఏయువకుడు రోడుమీదకనపడ్డా ప్రశ్నలతో వేధిస్తున్నారు అనుమానంగా కనిపిస్తే లాకప్‌లో చిత్రిహింసలకు గురిచేస్తున్నారు. ఎక్కడచూసినా పోలీసులదౌర్జన్యాలగూర్చిన మాటే!

రామయ్య, సోమయ్య కలిశారు ఇద్దరూ సారాషాపుల యజమాన్లే.

"కొత్తగ పోలీసులను పిలిపిచ్చిన్రటగద ?" రామయ్య అన్నాడు.

"పోలీసులనే గాదు మన కాంట్రాక్టరుకు రెండు కమ్యూనిస్టుపార్టీల మద్దతు గూడవున్నదట ఎందుకంటె పక్క-జిల్లా కమ్యూనిస్టులీడరు మనదాంట్ల పార్ట్నరట అవు తలిజిల్లాలల్ల నుంచి పార్టీమనషులనుగూడా తెచ్చిన్రు. కాని ఏమైద్ది వాల్లతోని ?" సోమయ్య అడిగాడు.

"నాల్రోజుల్నించి ఇరలొల్లి తక్కువగాలేదా ?"

"ఏంతక్కువైంది ? ఇదివరకంటె వందరూపాయలు ఎక్కువ అమ్మతాంది కని నాషాపుకాడ నలుగురు పోలీసులకాపలా! నలుగురికి నాలుగు పదిహేన్లు అరవై రూపాయలబత్తా, భోజనాలకోఇరవై, తాగుడోఇరవై వందరూపాయిలు అటేపోతున్నయి. ఏంమిగులుతాంది ? పట్టిపోలీసులున్నప్పుడు వచ్చినంత మందిగూడ ఈ చిప్పపోలీసు లున్నప్పుడు వస్తలేరు. ఇంకెందుకయా ఈ పోలీసు ?" సోమయ్య మాటలు రామయ్య విన్నాడు. నిజంతప్ప కల్తీ ఏమాత్రంలేదు ఆ మాటల్లో.

"పోలీసులతోటి ఏమన్నలంఖద్దా అసలు ?"

"ఏంగాదు వూకె పోజులుగొట్టుడుఎరుక పిల్లకు గంతే పిల్లనుబట్టుకొని ఎందు కమ్మాలెమనం ? అమ్మినాగూడా మనకొచ్చే కమీషను ఏమన్నపెరిగిందా ? ఆయింత మూడు ముడికాస్ల కమీషనుకోసం ప్రాణభయంతోని యాపారందేనికి జెయ్యాలె ? అమ్మకపోతేపోనీ మనకు బొయ్యేది ఆమూడుకాస్లేగద ! ఇది అటో ఇటో తేలేదాక మనంగూడ సప్పుడుచెయ్యకుంట ఊకుంటె అయిపాయె. మనకెందుకట ఈపీకు లాట ?" సోమయ్య అన్నదివిని రామయ్య తల వూపాడు. "నిజమే" అని ఎవరి దోవన వాళ్లు వెళ్ళారు.

* * * *

"రంగారావునిపిలు !" రాజుగారు పావలాపార్ట్నర్‌తో చెప్పాడు. కాసేపటికి రంగారావు వచ్చాక

979

"కాలేజీ ఆడిటోరియంలో సీ ఆర్పీ క్యాంపుందిసూడూ! అక్కడికో బస్తెడు కూరగాయలు పంపించవయ్యా! ఇప్పుడే వాడెవుడో పోన్జేసేడు" అన్నారు రాజుగారు.

"ఎక్కడండీ కాలేజీ?" రంగారావు అడిగాడు. రాజుగారు విసుగ్గాచూశారు.

"యూనివర్సిటీవాళ్లా పోలీసుసభ పెట్టేరుచూడు! ఆ ఆడిటోరియంలోనే ఇప్పుడు క్యాంపుపెట్టేరు" అన్నారు. రంగారావుకి అర్థమైంది.

ఆతడు వెళ్ళిపోగానే రాజుగారు పార్ట్నర్ కేసిచూసి "అనుకోంగానీ, కొన్ని కొన్ని పనులకి అనుకోని సంబంధాలుంటాయయ్యా! యూనివర్సిటీలో కొందరు లెక్చెరర్లు పోలీసు డిపార్ట్మెంటిప్పుడు యలాగుంది, మరెలాగుంటే బాగుంటుంది అన్జెప్పి ఓ సభపెట్టేరు. దాంట్లో పెద్దపెద్ద పోలీసాఫీసర్లంతా లెక్చెర్లు దంచేసుకో. తర్వాత కలట్రు ఓసారినాతో అదీ ఇదీ మాట్లాడుతూ మనకి కల్చరల్ పోలీసులూ ఉన్నారండీ అన్నాడు. అల్లుండటం మనకీశానాలాభమంట. ఎందుకంటే ఈల్లలాగా కనిపిచ్చేట్టు తుపాకుల్తోగాకుండా కన్పించకుండా పన్జేత్తారట. పైగా ఆపని తాము జేత్తున్నామని ఆల్లకి తెలిసేయీలుగూడా లేదట. కొంతమంది కథలూ, పాట్లూ గీకే వోళ్లు, మేవేఁ తెలివిగలోళ్లం మాలెక్కలూ, సిద్ధాంతాలతోటే లోకంనడుస్తోందనుకునే ఎర్రినన్నాసులూ ఈళ్లలో ఉంటారు ఆళ్లకసలు బుర్రుండదు. ఉందన్జెప్పి సారా ద్రిమ్మంతనోటితో చెప్పుకుంటూ వుంటారు. ఆడేం మాట్లాడినా మనం భేష్ భేష్, యహూజెప్పేస్తే, అద్గదీ సంగతి అంటూవుంటే ఆడు మనకి ఈ కల్చరల్ పోలీసుపని ఆడికీ తెలేకుండానేజేత్తాడు." రాజుగారు చెప్పటం ముగించాక పావలా పార్ట్నర్ అన్నాడు.

"ఈళ్లపని సరేగానీండి ఇయాళ మనూర్లో చీఫ్మినిస్టరున్నాడు గదా! మన బాధలు స్వయంగా ఆరికిజెప్పుకుంటే బాగుంటుందిగదండీ!"

"సర్సరే! మనం డవిరెక్టుగాఎల్లి చెప్పుకుంటామటయ్యా? మెడ్రాసులో నైతే నేనుహోల్డాసర్నీ ఆయన వీరో గనక బాగుండేదేవోఁగానీ ఇక్కడ పొజిసను మారిపోయిందిగా. నేను సారాకాంట్రాక్టర్నీ ఆయనేమో ముఖ్యమంత్రి! మనం ఆయన్దగ్గరికెళ్లడం ఎవుడన్నాసూశాడనుకో. రేపొద్దున ఏదన్నాజరిగితే సారావాడూ ఈడూ కలిసే ఇదంతాజేశారన్జెప్పి అస్సెంబ్లీలో ఆయనకెంత అపర్దిష్ట! అంచేత ఈ జిల్లా పార్టీఅధ్యక్షుడు మనాడేగా, ఆడితో జెప్పి సంగతంతా చీఫ్మినిస్టరు శెవిలో ఊదే ఏర్పాటు జేశే ఉంచాలే" రాజుగారు నవ్వారు.

980

* * * *

పొద్దుణ్నుంచీ పోలీసు వాహనాలూ, వాటితో పోటీ పడుతున్నట్టుగా ఇతర ప్రభుత్వవాహనాలూ రోడ్లమీద పిచ్చికుక్కల్లా పరిగెడుతుంటే ప్రజలు విస్తుపోలేదు. ఈ రకం వాహనాల హడావిడీ, పోలీసుల తుపాకులూ, సన్నీలూ అంతావారికి మామూలై పోయింది. ఎవరైనా చుట్టాలువస్తే ఇంతమంది పోలీసులువున్నవూళ్లో మీరు ఎలాజీవిస్తున్నారని ఆశ్చర్యపోవటం ఆ నగరవాసులకే ఆశ్చర్యం!

ఆరోజు ఆ నగరానికి ముఖ్యమంత్రి వచ్చాడు కాబట్టి మూడురోడ్ల కూడలిదగ్గర పోలీసుల బందోబస్తు ఎక్కువగావుంది. జనాన్ని గుంపుగారానీయకుండా అడ్డుపడి ఒక్కొక్కణ్నే ఫిల్టర్ చేసి పంపుతున్నారు పోలీసులు అందుక్కారణం ముఖ్యమంత్రి బసచేసిన గెస్టుహౌజ్ ఆరోడ్డునే వుండటం.

కొన్ని పదిలమంది పోలీసు కానిస్టేబుళ్లూ, ఐదారుగురుయస్సైలూ, ఇద్దరు ముగ్గురు సిఐలూ, డీఎస్పీలూ, ఎస్పీ, కలెక్టరూ వగైరా యంత్రాంగం అంతామారణాయుధాలతో మోహరించి సంఘ వ్యతిరేకశక్తులు ప్రవేశించకుండా కాపలాకాస్తున్న ఆరోడ్డుమీద ముఖ్యమంత్రిగారి వజ్రఖచితకర్ణపుటాలను సోకిననినాదాలు ఏమిటంటే

"రాడికల్స్ దౌర్జన్యం నశించాలి"

"ఊరూరికీ, ప్రతికాలేజీకీ పోలీసు క్యాంపు కావాలి"

"కాషాయవేషులం, ప్రజల గుండె జ్యోతులం"

ఇంతపకడ్బందీగావున్నా ఈనినాదాలేమిటని ముఖ్యమంత్రి ఆశ్చర్యపోలేదు. కలెక్టరుతాను రాడికల్స్‌ని ఎలా అణిచేశారో ముఖ్యమంత్రికి వివరించాడు. ఇంకా వివరాలకోసం తక్షణమే పోలీసు రాష్ట్రఉన్నతాధికారులతో, జిల్లాపాలనా యంత్రాంగంతో సమావేశం ఏర్పరిచాడు. ఆ సమావేశం జరిగే హాలులోకి అందరూ ప్రవేశించాక కలెక్టరుగారు స్వయంగా తలుపులుమూశారు.

కాసేపటికి............

నగరం నడిబొడ్డున. ఐదారుగురు సాయుధ పోలీసులు ఎప్పుడూ మృత్యుదూతల్లా పర్యవేక్షిస్తుంటే, రద్దీగావున్న మూడురోడ్లకూడలి మీద ప్రధాన పోలీసు కార్యాలయానికి రైఫిల్ రేంజిలో ముఖ్యమంత్రి బసకి సైరన్ వేటు దూరంలోవున్న సారా దుకాణం మీద రాడికల్స్ దాడిచేసి దాన్ని తగలబెట్టారని వార్తవచ్చింది.

981